సాక్షి విజయనగరం

మంగళవారం । 31 । జనవరి । 2023



సాగునీటి ప్రాజెక్టుల్లో ఉపాధి పనులు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతాంగానికి మేలుజరిగే పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. - 8లో



వైభవంగా శివపార్వతుల కల్యాణం

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం దేవాలయ క్షేత్రపాలకుడు ఉమాసదాశివ స్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. - 8లో



కలెక్టర్ స్పందనకు 146 వినతులు

విజయనగరం జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 146 వినతులు అందాయి. - 8లో

న్యూస్‌రీల్

డీఆర్సీ సమావేశం వాయిదా

విజయనగరం అర్బన్: కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరగాల్సిన జిల్లా సమీక్ష సమావేశం వాయిదా పడినట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు సూచనల మేరకు వాయిదా వేసినట్టు వెల్లడించారు. సమావేశం జరిగే తదుపరి తేదీని మళ్లీ ప్రకటిస్తామన్నారు.

ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తాం

- ఆర్‌బీకేల ద్వారా సేకరణ మళ్లీ ప్రారంభించాం
- జేసీ మయూర్ అశోక్



విజయనగరం అర్బన్: జిల్లాలో రైతుల వద్ద ఉన్న ధాన్యం మొత్తం కొనుగోలు చేస్తామని, ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలును తిరిగి ప్రారంభించామని జేసీ మయూర్‌అశోక్ సోమవారం చెప్పారు. పౌర సరఫరాల కార్పొరేషన్ ద్వారా రూపొందించిన యాప్ ఆధారంగా రైతుల వద్ద లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్టు గుర్తించామన్నారు. చిన్న, సన్నకారు రైతుల వద్ద మిగిలి ఉన్న ధాన్యం సేకరణకు తొలి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు రైతుల నుంచి 500 ఆర్‌బీకేల ద్వారా 2.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. బిల్లుల రూపంలో రూ.422 కోట్లను చెల్లించినట్టు వెల్లడించారు.

హైవే పనుల పరిశీలన



తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ సూర్యకళ

కొత్తవలస రూరల్: కొత్తవలస మండలంలో జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను ఆర్డీఓ సూర్యకళ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దెందేరు, గులివిందాడ, చీపురువలస, వీరభద్రపురం, రాయపురాజుపేట గ్రామం గుండా వెళ్తున్న రహదారి పనులను నేషనల్ హైవే పీడీ రోహిత్‌తో కలిసి చర్చించారు. నోటిఫికేషన్‌లో పడని సర్వే నంబర్లు ఏవైనా ఉంటే తెలపాలని తహసీల్దార్ కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవులపల్లి ప్రసాదరావు, ఆర్‌ఐ దివ్యకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు రహిత సమాజాన్ని నిర్మిద్దాం


- అవగాహన పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ సూర్యకుమారి



ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: కుష్టురహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఏటా జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు 15 రోజులపాటు కుష్టువ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 'స్పర్శ్ లెప్రసీ అవగాహన ప్రచార కార్యక్రమం' నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్లను స్పందన కార్యక్రమంలో సోమవారం ఆవిష్కరించారు. అనంతరం ఆడిటోరియం బయట ఏర్పాటు చేసిన ప్రచార పోస్టర్‌పై కలెక్టర్ సంతకం చేశారు. కార్యక్రమంలో కుష్టు, ఎయిడ్స్, క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్ జె.రామేశ్వరి ప్రభ పాల్గొన్నారు.

వెండిబిళ్లపై మహాత్ముడి ముఖ చిత్రం




రాజాం సిటీ: రాజాం పట్టణంలోని కస్పావీధికి చెందిన మైక్రో ఆర్టిస్టు, స్వర్ణకారుడు ముగడ జగదీష్ జాతిపిత మహాత్మాగాంధీ ముఖచిత్రాన్ని 3.130 మిల్లీ గ్రాముల వెండిపై 70 నిముషాల వ్యవధిలో చెక్కి అబ్బుర పరిచాడు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా ఆయన ముఖచిత్రాన్ని చెక్కినట్టు తెలిపాడు.

గ్రౌండ్ రిపోర్ట్

పేదల కోసం పెద్ద ఊరు

విజయనగరం జిల్లా గుంకలాం సమీపంలో నేషనల్ హైవే బైపాస్ రోడ్డు నుంచి వందమీటర్ల లోపలకు వెళ్తేచాలు... రాష్ట్రంలోనే అతిపెద్ద పేదల ఊరు కనిపిస్తుంది. అందులో సాగుతున్న నిర్మాణాలు పేదల్లో సంతోషాన్ని నింపుతున్నాయి. ఎటు వైపు చూసినా పనుల జాతరే. కోట్లాది రూపాయల వ్యయంతో ఓ వైపు ఇళ్ల నిర్మాణాలు.. మరోవైపు మౌలిక సదుపాయాల కల్పన పనులు చకచకా సాగుతున్నాయి. పట్టణంలోని పేదలందరికీ సొంతింటి భాగ్యం కల్పించాలన్న ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషికి గుంకలాం లే అవుట్ నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయితే ఇదొక పెద్ద పట్టణంగా అవతరిస్తుందన్న ఉద్దేశంతో విద్యాసంస్థలు, వ్యాపార సముదాయాలు నెలకొల్పేందుకు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అందుకే.. అక్కడ లే అవుట్ వేయకముందు ఎకరా భూమి ధర రూ.10లక్షలు ఉంటే.. ప్రస్తుతం రూ.కోటి పలుకుతోంది. అంటే.. ఆ ప్రాంత అభివృద్ధిని ఊహించవచ్చు.

- పేదలందరికీ ఇళ్లు పథకంతో సొంతింటి భాగ్యం
- రాష్ట్రంలోనే అతి పెద్ద లే అవుట్‌లలో 'గుంకలాం'కు ప్రత్యేక గుర్తింపు
- చకచకా సాగుతున్న నిర్మాణాలు
- పేదల్లో సొంతింటి సంతోషం
- లే అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట



గుంకలాం లే అవుట్‌లో సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు (ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం)



గృహ ప్రవేశంలో పరమాన్నం వండుతున్న మహిళ

విజయనగరం డెస్క్:

ఇల్లు లేని పేదవాడు ఉండకూడదన్నది జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. దీనికోసం నవరత్నాల్లో భాగంగా 'పేదలందరికీ ఇళ్లు' పథకాన్ని ఆచరణలోకి తెచ్చింది. ఊరూరా వైఎస్సార్ జగనన్న కాలనీ లే అవుట్లను వేసింది. లబ్ధిదారులకు స్థలాలతో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తోంది. ఇందులో భాగంగానే విజయనగరం పట్టణంలో నివసిస్తున్న నిరుపేదలందరికీ సొంతింటి భాగ్యం కల్పించాలన్న ఉద్దేశంతో గుంకలాం, సారిక, కొండకరకాంలలో లే అవుట్లు వేసి 18,632 స్థలాలుగా విభజించింది. వీటిలో గుంకలాం లే అవుట్ రాష్ట్రంలోనే అతిపెద్ద లే అవుట్లలో ఒకటి. 394.06 ఎకరాల విస్తీర్ణంతో 12,216 ఇళ్ల స్థలాలతో ఓ పెద్ద పట్టణాన్నే తలపిస్తోంది. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషిచేస్తున్నారు. లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారు. బిల్లులు చకచకా మంజూరు చేయిస్తున్నారు. నిర్మాణ సామగ్రిని రాయితీపై సమకూర్చుతున్నారు. గుంకలాం లే అవుట్‌ను రాష్ట్రంలోనే అత్యుత్తమ లే అవుట్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. లే అవుట్‌ను సందర్శించే వారికి ప్రభుత్వ ఆశయం స్పష్టంగా కనిపిస్తుంది. కోట్లాది రూపాయల వ్యయంతో సాగుతున్న మౌలిక సదుపాయల కల్పన ముచ్చటగొల్పుతుంది. ఎటు వైపు చూసినా కనుచూపు మేరలో సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు ఓ పెద్ద పట్టణం రూపుదిద్దుకుంటోందన్న భావనను కలిగిస్తాయి.

పేదలకు ప్రభుత్వ లబ్ధి ఇలా..

- సిమెంట్ బస్తా బయట రూ.350 ఉంది. ప్రభుత్వం రూ.270కు 90 బస్తాలు ఇవ్వడం వల్ల ఒక లబ్ధిదారునికి రూ.7,500 ఆదా అవుతోంది.
- ఇసుక టన్ను రూ.850 ఉండగా ఒక లబ్ధిదారునికి 20 టన్నులు ఉచితంగా ఇవ్వడం వల్ల రూ.17వేలు ఆదా అవుతోంది.
- ఇతర నిర్మాణ సామాగ్రి కిటికీలు, తలుపులు, పైపులు వంటి వాటి వల్ల రూ.5వేలు ఖర్చు మిగులుతోంది.
- ఇంటి బిల్లు రూ.లక్షా 80వేలతో పాటు బ్యాంకు రుణం రూ.35వేలు ప్రభుత్వం మంజూరు చేయిస్తోంది.

నివాస యోగ్యమైన లే అవుట్

రెండు వైపులా కొండలు.. మరోవైపు చెరువులు, పంట భూములు, రహదారుల నడుమ విస్తరించి ఉన్న లే అవుట్ పూర్తిగా మెట్టప్రాంతం. ఇళ్ల నిర్మాణాలకు, నివసించేందుకు అనువైనది. తాగునీరు పుష్కలం. అందుకే... ప్రభుత్వ లక్ష్యం త్వరగా సాకారమవుతోంది. ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తిచూపుతున్నారు.

గుంకలాం లే అవుట్ అన్నింటా అధికమే...

లే అవుట్ విస్తీర్ణం:	394.06 ఎకరాలు
మొత్తం స్థలాలు:	12,216
పంపిణీ చేసిన స్థలాలు:	11,091
మంజూరు చేసిన ఇళ్లు:	10,625
ప్రారంభించిన ఇళ్లు:	5,100
పూర్తయిన ఇళ్లు:	70
స్లాబ్ వేసిన ఇళ్లు:	120
పునాదులు పూర్తయినవి:	4,910
ఇంతవరకు పంపిణీ చేసిన ఐరన్:	1200 టన్నులు
పంపిణీ చేసిన సిమెంట్:	1,30,000 బస్తాలు
ఉచితంగా పంపిణీ చేసిన ఇసుక:	30వేల టన్నులు

చెరువులోనే విద్యాలయాలు...

లే అవుట్‌కు 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో జేఎన్‌టీయూ గురజాడ వర్సిటీ, ఆంధ్రాయూనివర్సిటీ, సెంచూరియన్ యూనివర్సిటీ, పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు ఉన్నాయి. ఇప్పుడు ఆ ప్రాంతంలో మరిన్ని విద్యాలయాలు, వ్యాపార సముదాయాల ఏర్పాటుకు పోటీ పడుతున్నారు. దీంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. లే అవుట్ వేయకముందు ఆ ప్రాంతంలో ఎకరా భూమి ధర రూ.10లక్షలు ఉంటే ఇప్పుడు రూ.కోటి పలుకుతోంది.

'ఇల్లంత' సంతోషం

చిత్రంలో గృహప్రవేశానికి హాజరైనవారంతా ఇంటి లబ్ధిదారు బొడ్డేపల్లి హేమలత బంధువులు. విజయనగరం పట్టణంలోని ప్రదీప్‌నగర్‌లో కుటుంబంతో కలిసి ఆమె అద్దె ఇంటిలో ఉండేవారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం గుంకలాంలో స్థలంతో పాటు ఆర్థిక సహకారం అందించడంతో ఇంటినిర్మాణం పూర్తిచేసుకున్నారు. ఈ నెల 27న గృహప్రవేశం చేశారు. అందంగా నిర్మించుకున్న ఇంటిని చూసి ఇంటిల్లపాదీ మురిసిపోతున్నారు.





పేదల దేవుడు జగనన్న

జగన్‌మోహన్‌రెడ్డి నిజంగా పేదల దేవుడు. గుంకలాం లే అవుట్‌ను సందర్శించేవారికి అది స్పష్టంగా అర్థమవుతుంది. పేదల కోసం ఇంత పెద్ద లేఅవుట్ వేసి, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ.. ఇళ్ల నిర్మాణానికి లబ్ధిదారులకు అండదండలు అందిస్తున్నారు. ఈ రోజు పక్కా ఇంటిలో ఆనందంగా ఉన్నామంటే ఆయన చలువే. ఇక్కడి లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తయితే ఓ పెద్ద పట్టణమే అవుతుంది.

– రిక్కా పద్మావతి, గృహనిర్మాణ లబ్ధిదారు, గుంకలాం లే అవుట్


లే అవుట్ అభివృద్ధి ఇలా...

ఇళ్ల నిర్మాణం సులభంగా చేసుకునేందుకు లబ్ధిదారుల కోసం రెండు గోదాములు రూ.10లక్షలతో నిర్మించారు.

- నీరు కల్పించడం కోసం 108 బోర్లు రూ.8.52 కోట్ల వ్యయంతో తవ్వించారు.
- పనులు నిమిత్తం విద్యుత్ కోసం రూ.1.10 కోట్లు ఖర్చు చేశారు.
- స్థలం చదును, రోడ్లు పోల్చడం, కల్వర్టులు కోసం రూ.2.73 కోట్లు ఖర్చు చేశారు.
- జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు వేసేందుకు రూ.54 కోట్లు కేటాయించారు.



- విద్యుత్ స్తంభాలకు రూ.12కోట్లు కేటాయించగా, ఇప్పటికే రూ.5కోట్ల విలువైన పనులు పూర్తిచేశారు.



లే అవుట్‌కు నలువైపులా మార్గాలు

పేదల లే అవుట్ గుంకలాం వెళ్లేందుకు నలువైపులా మార్గాలున్నాయి. బైపాస్ రోడ్డులో వెళ్లేవారికి లే అవుట్ కనిపిస్తుంది. నేరుగా చేరుకోవచ్చు. మరోవైపు చెల్లూరు–అంబటివలస రోడ్డులోనూ వెళ్లవచ్చు. అందుకే ఆ మార్గాన్ని కూడా విస్తరిస్తున్నారు. భవిష్యత్‌తో రాకపోకలకు ఇబ్బంది లేకుండా రైలు బ్రిడ్జి పనులు కూడా చకచకా సాగుతున్నాయి. గుంకలాం గ్రామం నుంచి కూడా లే అవుట్‌కు వెళ్లవచ్చు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా గుంకలాం లే అవుట్‌లో పట్టణ పేదలకు స్థలాలు కేటాయించాం. భవిష్యత్‌లో సొంతిల్లులేని పేదలు ఉండకూడదన్న ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చుతున్నాం. పేదలందరికీ ఇళ్లు పథకం కింద లబ్ధిదారులందరూ ఇళ్లునిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

– ఆర్.శ్రీరాములునాయుడు, కార్పొరేషన్ కమిషనర్

ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది

రాష్ట్రంలోనే అతిపెద్ద లే అవుట్‌లలో గుంకలాం ఒకటి. ఇటీవల ఇక్కడ ఇళ్ల నిర్మాణం ఊపందుకుంది. లబ్ధిదారులను చైతన్య పరుస్తుండడంతో నిర్మాణాలకు ముందుకొస్తున్నారు. కాంట్రాక్టర్లు కూడా పనులు వేగవంతం చేశారు. ఉగాది నాటికి 1100 ఇళ్లు పూర్తిచేసి గృహప్రవేశాలు చేస్తాం. సాధ్యమైనంత తొందరగా మొత్తం ఇళ్లు పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. జిల్లాకే కాదు రాష్ట్రానికి ఆదర్శ లేఅవుట్‌గా నిర్మించేందుకు కలెక్టర్, గృహనిర్మాణశాఖ పీడీ, ప్రజాప్రతినిధుల సహకారంతో ముందుకు సాగుతున్నాం.

– జి.వి.రంగారావు, డీఈ హౌసింగ్, విజయనగరం



లే అవుట్‌లో నిర్మాణాల కోసం సిద్ధం చేసిన ఇసుక



లే అవుట్‌లోని ఇటుకల తయారీ యూనిట్



లే అవుట్‌లో డంప్ చేసిన ఇనుము



జోరుగా సాగుతున్న ఇంటి నిర్మాణం

1న జెడ్పీ స్థాయి సంఘ సమావేశం

విజయనగరం గంటస్తంభం: వచ్చేనెల 1న జెడ్పీ స్థాయి సంఘ సమావేశాన్ని నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్ తెలిపారు. ఆదేరోజు ఉదయం 11 నుంచి 1వ స్థాయి సంఘం నుంచి 7వ స్థాయి సంఘం సమావేశాలు జరుగుతాయన్నారు. అధికారులు, స్థాయి సంఘ సభ్యులు పాల్గొనాలని కోరారు.

గాంధీజీ అడుగుజాడల్లో నడుద్దాం



గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్, అధికారులు

విజయనగరం గంటస్తంభం: సత్యాగ్రహమే ఆయుధంగా, అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సాధించిన మహాత్మాగాంధీ రాబోయే తరాలకు కూడా స్ఫూర్తిణీయులని, ఆయన అడుగుజాడల్లో నడుద్దామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సాధన ద్వారా కోట్లాది మందికి స్వేచ్ఛ అందించిన ఘనత గాంధీజీదని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఆయన పోరాట పటిమ, ఆయన నడిపిన మార్గం తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎందరో మహనీయుల పోరాటఫలం మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్య భారతదేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, పలాస వైఎస్సార్ సీపీ పరిశీలకులు కె.వి.సూర్యనారాయణరాజు, గరివిడి వైఎస్సార్‌సీపీ నాయకులు మీసాల విశ్వేశ్వరరావు, జెడ్పీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్–19 జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్–19 బాల, బాలికల కబడ్డీ పోటీల్లో తలపడనున్న జిల్లా జట్ల ఎంపిక సోమవారం పూర్తయ్యాయి. అండర్–19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 24 మంది క్రీడాకారులను బాల, బాలికల జట్లకు ఎంపిక చేశారు. మరో 8 మంది క్రీడాకారులకు స్టాండ్‌బైలుగా అవకాశం కల్పించినట్టు అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, బొమ్మన రామారావులతో పాటు పీడీలు కె.తౌడు బాబు, గోపాల్, ఎం.ఉదయ్ పర్యవేక్షించారు.



బాలుర కబడ్డీ జట్టు

పేదల ఆర్థిక అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- చేదోడు పథకం కింద 17వేల మందికి రూ.17 కోట్ల ఆర్థిక లబ్ధి

విజయనగరం అర్బన్: పేద ప్రజల సంక్షేమం.. ఆర్థిక అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో వర్చువల్ విధానంలో జగనన్న చేదోడు పథకం మూడో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియోకాన్ఫరెన్స్ హాల్‌లో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, కలెక్టర సూర్యకుమారి, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ కులవృత్తే ఆధారంగా జీవనం సాగించే నాయీ బ్రాహ్మణులు, దర్జీలు, రజకులకు ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వారికి అండగా నిలుస్తోందని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ఆర్థిక సమానత్వమే లక్ష్యంగా ప్రభుత్వపాలన సాగుతోందని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఉండే ప్రతివర్గానికి న్యాయం జరిగేలా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డికి మరోసారి ఆశీర్వాదాలను అందించాలని విజ్ఞప్తి చేశారు. జగనన్న చేదోడు పథకం మూడో విడత నిధుల విడుదలలో భాగంగా జిల్లా నుంచి 17,245 మంది లబ్ధి పొందారని కలెక్టర్ ఎ.సూర్యకుమారి వివరించారు. ఒక్కొక్క లబ్ధిదారునికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.17.245 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్టు వెల్లడించారు. చేదోడు పథకం కింద మొదటి విడతలో 16,359 మందికి రూ.16.359 కోట్లు, రెండో విడతలో 13,331 మందికి రూ.13.331 కోట్లు, మూడో విడతలో 17,245 మందికి రూ.17.245 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. కార్యక్రమంలో రూ.17.245 కోట్ల విలువగల మెగా చెక్కును డిప్యూటీ స్పీకర్, జెడ్పీ చైర్మన్, జిల్లా కలెక్టర్, మేయర్ చేతుల మీదుగా జగనన్న చేదోడు పథక లబ్ధిదారులకు అందజేశారు.



జగనన్న చేదోడు నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు

విజయనగరం క్రైమ్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగినా, మద్యం మత్తులో వాహనాలు నడిపినా చర్యలు తప్పవని ఎస్పీ ఎం.దీపిక హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాశాంతికి భంగం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి జనవరి 1 నుంచి జనవరి 29 వరకూ మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 1091 కేసులు, మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 493 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య



వరలక్ష్మి మృతదేహం

గంట్యాడ: కొడుకు కోడలు అంధులు. అంధులైన వారికి తాను భారం కాకూడదని భావించిన ఓ మాతృమూర్తి మండల కేంద్రానికి చెందిన మల్యాడ వరలక్ష్మి (60) ఈనెల 26వతేదీన పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

2400 సారా ప్యాకెట్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న సారా ప్యాకెట్లు, నిందితులతో పోలీస్, ఎస్‌ఈబీ అధికారులు

పాచిపెంట: అక్రమంగా సారా అమ్మకాలు చేస్తున్న కొంతమంది నుంచి 2400 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వెంకటరమణ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలో సోమవారం ఉదయం పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చల్లా నూకరాజు, బోను గంగరాజు, చల్లా సత్యవతి, యడ్ల వెంకటమ్మ, సమా వీరాస్వామిల నుంచి 12 బస్తాల్లో 2400 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. దాడుల్లో సాలూరు రూరల్, మక్కువ ఎస్సైలతో పాటు పోలీస్, ఎస్‌ఈబీ అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టుల్లో ఉపాధి పనులు

- గుర్తించిన పనుల సంఖ్య 199
- ప్రారంభమైనవి 76



ఆండ్ర సాగునీటి ప్రాజెక్ట్ పరిధిలోని గంగచోళ్ల పెంట కాలువలో పనులు చేస్తున్న వేతనదారులు

విజయనగరం ఫోర్ట్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతాంగానికి మేలు చేసే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే దానికి సంబంధించిన పనులు కూడా ప్రారంభించింది. ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు చెరువులు, చెరువు పరిధిలో ఉన్న కాలువల్లో పూడిక తీత, చెరువులు ఎత్తు చేయడం, మొక్కల పెంపకం చేపట్టేవారు. అదేవిధంగా ఉపాధి నిధులతో గ్రావెల్ రోడ్లు, సీసీ రోడ్లు, చెక్ డ్యామ్‌లనిర్మాణం, రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ నిర్మాణం చేపట్టేవారు. తొలిసారిగా సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో కూడా ఉపాధి హామీ పనులు చేపట్టారు.

సాగునీటి కాలువల్లో పూడికతీత

సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో ఉన్న కాలువలు ఏళ్ల తరబడి పూడికతీతకు నోచుకోలేదు. తుప్పలు, చెత్త చెదారంతో నిండి పోయాయి. దీంతో సాగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదు. ఈ నేపథ్యంలో సాగునీటిప్రాజెక్టుల పరిధిలో ఉన్న కాలువల్లో పూడికతీత కోసం ఉపాధి హామీ పథకం అధికారులు వేతనదారులతో పనులు మొదలు పెట్టారు. జిల్లాలోని తాటిపూడి, తోటపల్లి, వెంగళరాయ సాగర్, ఆండ్ర, పెద్దగెడ్డ, పెదంకలాం, పారాది, గజపతినరగరం కాలువల్లో పూడికతీత పనులు చేపట్టారు.

199 పనుల గుర్తింపు

జిల్లాలో ఉన్న సాగు నీటి పథకాల పరిధిలోని కాలువల్లో 199 పనులు చేసేందుకు అధికారులు గుర్తించారు. వాటిలో ఇప్పటి వరకు 76 పనులు ప్రారంభించారు. 1,46,564 పనిదినాలు 199 పనుల్లో కల్పించనున్నారు. ఈ పనులకు గాను ప్రభుత్వం రూ.3.74 కోట్లు వెచ్చించనుంది.

ఐదుగురు గంజాయి నిందితులకు రిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ ఎల్.అప్పలనాయుడు (పక్కనే నిందితులు)

గజపతినగరం: మండలంలోని కొత్తరోడ్డు రేల్వే ట్రాక్ సమీపంలో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం సాయంత్రం, మరో ఇద్దరు యువకులను దత్తిరాజేరు మండలం మానాపురం వద్ద సోమవారం అదుపులోకి తీసుకుని వారి దగ్గర గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి అమ్మకాలు, తరలింపు చేస్తున్న పెనుమత్స అప్పల నరసింహరాజు, చుండి రమేష్‌లను సోమవారం పట్టుకోగా.. గిరికుమార్, డానియల్,దిలీప్‌లను ఆదివారం అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితుల దగ్గర ఒక కేజీ 150గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో మానాపురం ఎస్సై బి.భాగ్యం ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ ఢీకొని 34 గొర్రెల మృతి



దుర్ఘటనలో మృతి చెందిన గొర్రెలతో లారీ

కొత్తవలస రూరల్: మండలంలోని అడ్డూరువానిపాలెం గ్రామం సమీపంలో సోమవారం తెల్లవారుజామున గొర్రెల మందపై నుంచి లారీ దూసుకెళ్లిన సంఘటనలో 34 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటనలో గొర్రెల కాపరి గోళగాని భూలోకకు గాయాలు కాగా 20 గొర్రెలు మృతి చెందాయి. గాయాలపాలైన వ్యక్తిని 108 వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. లక్కవరపుకోట మండలం కిత్తన్నపేట గ్రామానికి చెందిన దుక్క గంగునాయుడు తన గొర్రెల మందను కాపరి భూలోకతో కలిసి అనకాపల్లి నుంచి స్వగ్రామం కిత్తన్నపేట తరలిస్తుండగా కొత్తవలస మండలం కస్తూర్బా బాలికల పాఠశాల సమీపంలో సోంపురం వైపు వస్తున్న క్వారీ లారీ వచ్చి గొర్రెల మంద పైకి దూసుకుపోయింది.

రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటాలి

- మాస్టర్స్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు టీ షర్టుల ఆవిష్కరణ



రాష్ట్రస్థాయి మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల టీ షర్టులు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి తదితరులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు సత్తా చాటి పతకాలు సాధించాలని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పిలుపునిచ్చారు. వచ్చే నెల 2 నుంచి 5వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరులో జరగనున్న పోటీల్లో జిల్లా నుంచి పాల్గొనే 20 మంది క్రీడాకారులకు అందజేసే టీ షర్టులను సోమవారం స్థానిక డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ వయోభేదం లేకుండా బ్యాడ్మింటన్ క్రీడలో అద్భుతాలు సృష్టిస్తున్న మాస్టర్స్ క్రీడాకారులు నేటి తరానికి స్ఫూర్తి దాయకంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్, ఉపాధ్యక్షులు ఎంకెబి శ్రీను, టి.రమేష్, కోశాధికారి ఎం.అశోక్‌కుమార్, మీడియా ఇన్‌చార్జి ఎస్.మల్లికార్జునరావులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న సత్యనారాయణ

కురుపాం: కురుపాం మండల కేంద్రానికి చెందిన వెల్లంకి సత్యనారాయణ (59) గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కురుపాం సమీపంలోని టేఖరఖండి గ్రామవద్ద సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. రావాడ గ్రామం నుంచి కురుపాం వైపు ద్విచక్రవాహనంపై సత్యనారాయణ వస్తుండగా టేఖరఖండి గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో గ్రామస్తులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం వైద్యసిబ్బంది మెరుగైన వైద్య సేవల కోసం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఉన్న ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం దేవాలయ క్షేత్రపాలకుడు ఉమాసదాశివ స్వామి వారి కల్యాణం సోమవారం రాత్రి వైభవంగా జరిగింది. ఆలయాన్ని పవిత్ర జలంతో శుద్ధి చేసి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. వేకువజాము నుంచి ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. ముందుగా శివుడికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలరసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మల్లికార్జునశర్మ తదితరులు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివ, పార్వతులను పట్టువస్త్రాలు, వివిధ రకాల స్వర్ణాభరణాలతో సుందరంగా అలంకరించి రామతీర్థం పురవీధుల్లో ఊరేగించారు. తదుపరి దేవాలయంలోనికి తీసుకువచ్చి స్వామివారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. స్థానిక ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్వామివారి కల్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు, పూజా సామాగ్రి సమకూర్చగా ఆయన తనయుడు ప్రదీప్ సమర్పించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనధికార చిట్టీలు నిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు



ఎం.దీపిక, ఎస్పీ

విజయనగరం క్రైమ్: జిల్లాలో అనధికారికంగా చిట్టీలు నిర్వహించినా, ఆయా చిట్టీ నిర్వాహకులకు ఏజెంట్లుగా పనిచేసినా చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని ఎస్పీ ఎం.దీపిక హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో చిట్టీలు నిర్వహించి, అమాయకులను మభ్యపెట్టి, మోసాలకు పాల్పడుతున్న సంస్థలు, నిర్వాహకులు, ఏజెంట్లపై చట్టప్రకారం చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ తరహా నేరాలకు బాధ్యులైన వారిని ఇప్పటికే అరెస్టు చేయడంతో పాటు, మోసాలకు పాల్పడి, సంపాదించిన ఆస్తులను కూడా అటాచ్ చేశామన్నారు. వివిధ రకాల చిట్టీలు, స్కీమ్‌ల పేరుతో సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండా చిట్టీలు నిర్వహించడం, ఆయా సంస్థలకు ఏజెంట్లుగా పనిచేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇటువంటి ఆర్థిక మోసాలకు పాల్పడే వారిపై ప్రత్యేకంగా దృష్టిసారించామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎటువంటి అనుమతులేకుండా చిట్టీల నిర్వాహకులు ఇచ్చే కమీషన్‌కు ఆశపడి, ఏజెంట్లుగా పనిచేయడం, అమాయక ప్రజలను మభ్యపెట్టడం, ప్రలోభపెట్టడం, ఆయా సంస్థలు, చిట్టీ నిర్వాహకులు పాల్పడే మోసాల్లో భాగస్వాములు కావడమేనన్నారు. అటువంటి వారిపై కూడా చట్టరీత్యా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలు ఇటువంటి మోసాలకు గురికాకుండా చూసేందుకు ఇప్పటికే మహిళా సంరక్షణ పోలీసులు, స్థానిక పోలీసులతో క్షేత్ర స్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. అనధికార చిట్టీలు, ఆర్థిక సంస్థలు, స్కీమ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు.

కలెక్టర్ స్పందనకు 146 వినతులు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం అర్బన్: కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 146 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 109 ఉన్నాయి. హౌసింగ్‌కు 12, మున్సిపల్ శాఖకు 5, వైద్య శాఖకు 12 మిగిలినవి ఇతర శాఖలకు చెందిన వినతులు, పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు తదితర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. కార్యక్రమంలో కలెక్టర్ సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు, పద్మావతి, సూర్యనారాయణ, దొర పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించాలి

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె ఫిర్యాదుదారుల నుంచి 30 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారుల సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు సీహెచ్.రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	54,930-00
బంగారం(22కి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

వ్యవసాయ సంఘం డైరీ ఆవిష్కరణ



సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న డీఏఓ రాబర్ట్‌పాల్

పార్వతీపురం: వ్యవసాయ సంఘం డైరీని జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ సోమవారం ఆవిష్కరించారు. పార్వతీపురంలోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం డైరీని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా వ్యవసాయ సమాచార దర్శిని పేరుతో సంఘం డైరీ ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ డైరీలో అన్ని రకాల సమాచారం ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ఏఈఓలు బాబ్జీ, శ్రావణ్‌కుమార్, సూర్యనారాయణ, శంకరరావు, శైలజ, హైమావతి, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



వినతి పత్రాన్ని అందుకుంటున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ నాలుగోతరగతి ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఆ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీకి నూతన కార్యవర్గం ఎన్నికైన తరువాత సోమవారం కలెక్టర్ ఎ.సూర్యకుమారిని మర్యాద పూర్వకంగా సంఘం ప్రతినిధులు కలిశారు. అనంతరం వినతి పత్రం తమ ఆకాంక్షను తెలియజేశారు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ వీఎంఆర్‌డీఏ పథకం ద్వారా ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు సంఘం ప్రతినిధులు తెలివపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం జిల్లా అధ్యక్షుడు మువ్వల గంగాప్రసాద్ రావు, కార్యదర్శి పి.చంద్రశేఖర్ రాజు, అసోసియేషన్ ప్రెసిడెంట్ చందక శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు ఎం.మంగరాజు, అధ్యక్షురాలు బి.భారతి, పట్టణ కార్యదర్శి గంగి రమేష్, కోశాధికారి జి.అప్పారావు తదితరులు ఉన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలను అందజేస్తున్న జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: కారుణ్య నియామకాల కింద ఉద్యోగ పత్రాలను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం 8 మందికి జిల్లా పరిషత్ కార్యాలయంలో అందజేశారు. వారిలో ఆరుగురిని గ్రేడ్-5, ఇద్దరిని గ్రేడ్ -6 విభాగాల్లో నియమిస్తూ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎం. అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, డీపీవో నిర్మలాదేవి పాల్గొన్నారు.

సత్వరమే సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్



దివ్యాంగుడికి ఊతకర్రలు అందిస్తున్న జేసీ ఆనంద్



సమస్యలు వింటున్న అడిషనల్ ఎస్పీ దిలీప్‌కిరణ్

పార్వతీపురం: స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఒ. ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్‌లు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 96 అర్జీలు స్వీకరించారు.

సెల్లార్‌లో వినతుల స్వీకరణ

విభిన్న ప్రతిభావంతులకు సంబంధించిన అర్జీలను సెల్లార్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్పందనలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా సీతానగరం మండలం పెదంకలాం గ్రామానికి చెందిన గొట్టాపు సింహాచలానికి జాయింట్ కలెక్టర్ ఒ. ఆనంద్ ఊత కర్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐదు అర్జీలను విభిన్న ప్రతిభావంతులు అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్‌డీవీ రమణ, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథం, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎ.ఈశ్వర రావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, పీఆర్ ఎస్‌ఈ ఎంవీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ పీడీ పి.రఘురాం, డ్వామా పీడీ కె. రామచంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల కోఆర్డినేటర్ వి.చిట్టిబాబు, పౌర సరఫరాల సంస్థ డీఎం ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, డీపీఓ బి. సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

పార్వతీపురం టౌన్: సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా జిల్లా పోలీసు శాఖ పనిచేస్తుందని అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్‌కుమార్ అన్నారు. ఎస్పీ కార్యాలయంలో జిల్లా నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు వివరాలు తెలుసుకుని సంబంధిత పోలీసుస్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా అడిషనల్ ఎస్పీ సమాచారం తెలియజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దిశ డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్, డీసీఆర్బీ సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

[illegible]

K. SANKAR, Advocate
D.No. 49-38-13,N.G.G.O's Colony, Akkayyapalem, Visakhapatnam. Cell: 9848955228